క్లుప్తంగా

దివ్యాంగులు ఉచిత బస్సు పాసులను సద్వినియోగం చేసుకోండి

మాచర్ల: నియోజక వర్గ పరిధిలోని మాచర్ల ఆర్టీసి బస్టాండ్‌లో రెండు రోజుల పాటు సెప్టెంబర్ 1,2 తేదీల్లో దివ్యాంగులకు ఉచిత బస్సు పాసులను డిపో మేనేజర్ ఆర్ పిచ్చయ్య ఆధ్వర్యంలో అందించడం జరుగుతుందని ప్రతి ఒక్క దివ్యాంగుడు సద్వినియోగం చేసుకోవాలని చైతన్య వికలాంగుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు షేక్ అన్వర్‌భాషా బుధవారం అన్నారు. దివ్యాంగులందరికీ శుక్ర, శనివారాల్లో పీఎస్ఆర్ ఆంజనేయులు మీనాక్షి కంటి వైద్యశాల నిర్వాహకులు చిరుమామిళ్ళ కృష్ణయ్య, సీహెచ్ నరసింహరావుల సహకారంతో ఈ బస్సు పాస్‌లు అందజేయడం జరుగుతుందన్నారు. దివ్యాంగులంతా ఈ అవకాశాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని అన్వర్ కోరారు. ఉచిత బస్సు పాసుల కోసం వచ్చే ప్రతి ఒక్కరూ సదరన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్‌ఫోటోలు 2 తీసుకొని వచ్చి బస్సు పాస్‌లు పొందాలన్నారు. మరిన్ని వివరాలకు డిపో మేనేజర్ సెల్ నెం. 9959223432 ను సంప్రదించాలన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

దాచేపల్లి : నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వి. సత్యనారాయణ బుధవారం తెలిపారు. సచివాలయం-1 చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నాలని ఆయన కోరారు.

వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు



గురజాల : వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు , ప్రజలు ఆనందంగా ఉండాలని అకాంక్షిస్తూ శ్రీ పాటపాటేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి దేవాలయ కమిటీ చైర్మన్ కనకం ఆదినారాయణ దత్తు అన్నారు. స్థానిక పాటపాటేశ్వరి అమ్మవారి దేవాలయంలో బుధవారం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి జలాభిషేకం నిర్వహించారు. వర్షాలు కురవకపోవడంతో కరువు ప్రాంతంగా మారుతుందని అమ్మవారి కటాక్షం కోసం జలాభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసి డీఎం

మాచర్ల: ఆర్టీసి డిపో పరిధిలో ఉన్న సమస్యలను తెలుసుకునేందుకు గురువారం ఉదయం 11గం''ల నుంచి 12గం''ల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్టీసి డీఎం ఆర్ పిచ్చయ్య బుధవారం తెలిపారు. డిపో పరిధిలోని అవసరాల పై సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కొరకు డయల్ యువర్ డీఎంకు చేయాలన్నారు. సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. డయల్ యువర్ కార్యక్రమం సందర్భంగా : 9959225432కు పోన్ చేయాలని ఆర్టీసి డీఎం ఆర్ పిచ్చయ్య కోరారు. అదే విధంగా మాచర్ల నియోజక వర్గ పరిధిలో ఏపీఎస్ ఆర్టీసి ప్రతి పౌర్ణమి రోజున అరుణాచలంలోని గిరిప్రదక్షణ, అరుణాచలేశ్వరుని దర్శనానికి బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాలికోన్నత పాఠశాలలో 359 మందికి వైద్య పరీక్షలు



మాచర్ల: పట్టణంలోని రైల్వేగేటు పక్కనున్న జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సచివాలయం ఏఎన్ఎం నిర్మల, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది అనంతలక్ష్మి, కృష్ణకుమారి, సువర్ణ, షేక్ నగీనల ఆధ్వర్యంలో హెచ్‌బి రక్త బలహీనత పరీక్షలను బాలికలకు నిర్వహించారు. మొత్తం 359 విద్యార్థినులకు రక్తహీనత (బలహీనత) హెబి పరీక్షలు చేశారు. అనంతరం మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలి

క్రోసూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసి అభివృద్ధి చేయాలని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ డీఎస్ రమాదేవి కోరారు. స్థానిక పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, ఎంపీపీ పి.కోటయ్య అధ్యక్షత వహించారు. సభ్యులు ఎంపీడీఓ బి.మహేష్ బాబు, పీహెచ్‌సీ అదనపు వైద్యురాలు డాక్టర్ బాలఅంకమ్మ బాయి హాజరయ్యారు. వైద్యురాలు రమాదేవి మాట్లాడుతూ ఆస్పత్రి చుట్టూ గ్రావెల్ వేసి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

ఇంటింటికి తాగునీరు అందిస్తాం

- రూ. 2.50 కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మించాం
- రూ. 5కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు
- రూ.100 కోట్లతో ఎత్తిపోతల ద్వారా చివర భూములకు సాగునీరు
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : ఇంటింటికి కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామని గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని తంగెడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల కరపత్రాన్ని లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాసు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ..గ్రామంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించామని, రెండు నెలల్లోనే ఈ పనులు ప్రారంభిస్తామన్నారు. అక్క చెల్లెమ్మలు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను శాశ్వతంగా తొలగిస్తామని ఆయన చెప్పారు. గ్రామ చరిత్రలో ఎన్నాడు లేని విధంగా రూ.2.50 కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని, రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో సిమెంట్ రోడ్లు నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువస్తామని ఎమ్మెల్యే కాసు తెలిపారు. తంగెడ, ముత్యాలంపాడు, సారంగపల్లి అగ్రహారం, కొత్తూరు, వేమవరం, చెన్నాయపాలెం గ్రామాలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు రూ.5 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించామని, వ్యవసాయ కనెక్షన్లకు కూడా నాణ్యమైన కరెంట్‌ను ఈ సబ్‌స్టేషన్ ద్వారా అందిస్తామని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయంలోనే పొలంబాటలను బాగు చేశామని, లింకురోడ్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కాసు చెప్పారు.

ఎత్తిపోతల పథకం నిర్మిస్తాం...

తంగెడ గ్రామ సమీపంలోని కృష్ణానదిపై ఎత్తిపోతల పథకం నిర్మించి ఆయకట్టు చివర భూములకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే కాసు చెప్పారు. సుమారుగా రూ.100 కోట్లతో ఎత్తిపోతల పథకం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే పలు రకాల అనుమతులు మంజూరు అయ్యాయని ఆయన వివరించారు. తంగెడ మేజర్ కాలువ పరిధిలోని చివర భూములకు సాగునీరు అందకపోవడం వల్ల పంటల సాగులో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని ఎత్తిపోతల పథకం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు. ఎత్తిపోతల పథకం నిర్మాణం ద్వారా తంగెడ, ముత్యాలంపాడు, దాచేపల్లి, మాదినపాడు, సారంగపల్లి అగ్రహారం, కొత్తూరు, వేమవరం, చెన్నాయపాలెం, పెదగార్లపాడు, తుమ్మలచెరువు గ్రామాల్లోని చివర భూములకు సాగునీరు అందిస్తామని, రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కాసు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, సర్పంచ్‌లు దైద నాగరాజు, కొత్తపల్లి కాశయ్య, ఎంపీటీసీ పాతుల కమలకుమారి, మాజీ జెడ్పీటీసీ భూషణం చెన్నయ్య, కో ఆప్షన్ సభ్యుడు షేక్ హుస్సేన్, గ్రామ కన్వీనర్ ఉల్లి వీరేశ్వరరావు, నాయకులు ఆరికట్ల మల్లారెడ్డి, బీరవల్లి శౌర్రెడ్డి, దేవళ్ల వీరాస్వామి పాల్గొన్నారు.

దేవుడిపై దుష్ప్రచారం చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామస్తులు

దాచేపల్లి : దేవుడి ఉత్సవం కోసం చేసే పనులపై దుష్ప్రచారం చేయవద్దని భట్రుపాలెం గ్రామస్తులు కోరారు. దాచేపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని భట్రుపాలెం గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల కోసం గత 50 ఏళ్లుగా గ్రామంలో వేలం పాటలు నిర్వహిస్తున్నామని, ఈ పాటల ద్వారా సమకురిన డబ్బులతో స్వామివారి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని గ్రామస్తులు చెప్పారు. గత రెండు రోజుల క్రితం గ్రామస్తుల సమక్షంలోనే వేలం పాటలు నిర్వహించామని, దీనిపై కొంతమంది వ్యక్తులు రాజకీయ స్వార్థ ప్రయోజనాలు కోసం దుష్ప్రచారం చేసే కుట్రలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలం పాటలు ప్రజల సమక్షంలో జరిగితే బెల్ట్‌షాపుల కోసం వేలం పాటలు నిర్వహించారనే తప్పుడు ప్రచారం చేశారని, దేవుడి కోసం చేసే పనులను కూడా వక్రీకరించడం మంచి పద్ధతికాదని వారు అన్నారు. తమ గ్రామంలో బెల్ట్‌షాపుల నిర్వహణ పూర్తిగా నియంత్రించామని, కొంతమంది వ్యక్తులు కావాలనే దుర్మార్గమైన ప్రచారం చేస్తున్నారని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని గ్రామస్తులు చెప్పారు. గ్రామాభివృద్ధి కోసం సహకరించాలే తప్ప అభివృద్ధికి అటంకాలు సృష్టించవద్దని వారు కోరారు. సమావేశంలో సర్పంచ్ భూక్యా కొండనాయక్, ఎంపీటీసీ మూఢవత్ రెడ్యానాయక్, మాజీ సర్పంచ్ మూఢవత్ రత్యానాయక్, గ్రామస్థులు భూక్యా కల్యాణ్‌నాయక్, భూక్యా పిచ్చానాయక్, భూక్యా వెంకటేశ్వర్లు నాయక్, కేతావత్ మంత్రునాయక్, భూక్యా నరసింహనాయక్, భూక్యా తులస్యనాయక్ ఉన్నారు.

పథకాలు లబ్ధిదారులకు అందేలాచూడాలి

ప్రత్యేకాధికారి సంజీవరావు



ఓబులేశునిపల్లె జెడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

దుర్గి: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యే విధంగా పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి కె సంజీవరావు అన్నారు. బుధవారం మండలంలోని ఓబులేశునిపల్లె జెడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనం కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో పాటు ఆయన భోజనం చేశారు. భోజన ఏర్పాట్లు, చదువు విషయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ధర్మవరంలో ఎంపీయూపి స్కూల్‌లో విద్యార్థుల ప్రగతి పై సమీక్ష, హాజరుపట్టీలను పరిశీలించారు. యూనిఫాం, బ్యాగులు, బూట్లు తదితర వస్తువులను తనిఖీ చేసి విద్యార్థులకు అందినది లేనిది అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె సమతావాణి, సర్పంచ్ గంగారపు వెంకటరెడ్డి, సెక్రెటరీ శివకుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు



ప్రకృతి వ్యవసాయ రైతులతో బృందం సభ్యులు, డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఆరోగ్యకరమైన ఉత్పత్తులను సాధించవచ్చని ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ సభ్యులు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తూ రైతులు సాగు చేస్తున్న జిల్లాలోని వ్యవసాయ భూములను బుధవారం రీసెర్చ్ అండ్ లెర్నింగ్ సభ్యులు గుల్జార్, పి.శాలినీలు సందర్శించారు. నరసరావుపేట మండలంలోని దొండపాడు, పిడుగురాళ్ల మండలంలోని గుత్తికొండ, నకరికల్లు మండలంఓలని నకరికల్లు గ్రామాల్లోని వరి, పత్తి, మిరప పంటలను సభ్యులు పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల అనుభవాలను వీరు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ సభ్యులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటిస్తూ పంటలను పండించడం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించే దిశగా సిబ్బంది, రైతులు పనిచేయడం అభినందనీయమన్నారు. రైతు సాధికారిక సంస్థ రీజనల్ కోఆర్డినేటర్ వెంకట్రావు మాట్లాడుతూ ప్రధాన పంటలైన పత్తి, మిరప పొలాల్లో అంతర్ పంటలుగా క్యారెట్, బీట్రూట్, ముల్లంగి, కంది, దోస, ఉల్లి, బీర, బెండ, చిక్కుడు, టమోటా పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు.

దీని ద్వారా సంవత్సరం పొడవునా రైతుకు ఆదాయంతో పాటు ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం అమలకుమారి, ఏడీపీఎం వి.ప్రేమరాజ్‌లు పాల్గొన్నారు.

శ్రీనివాసునికి వెండి కిరీటం

వినుకొండ టౌన్: పట్టణంలోని శ్రీనివాస నగర్‌లో వెలసిన శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో 37వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండవ రోజు బుధవారం కళ్యాణ వేడుకలు వైభవంగా చేపట్టారు.ఈ కల్యాణ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఆలయ మాజీ జనరల్ సెక్రటరీ డీవీ అప్పారావు కుటుంబ సభ్యులు భార్య అరుణ, కుమారుడు రవిచంద్ర, కోడలు సింధులతో కలిసి, స్వామి వారికి రెండున్నర కిలోల వెండి కుండ కిరీటం అందచేశారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను ఆలయ అర్చకులు శ్రీనివాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రెడ్డి బంగారయ్య, సెక్రటరీ అచ్యుత కృష్ణ సుబ్బారావు, కోశాధికారి కాళ్ళ రామ కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పే-స్కేలు అమలు చేయాలి

నరసరావుపేట: వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, అర్హత గల వీఆర్ఏలకు వీఆర్వోలుగా ప్రమోషన్లు ఇవ్వాలని వీఆర్ఏలు కోరారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా తాము తలపెట్టిన కార్యక్రమానికి పాల్గొనేందుకు వెళుతున్న వీఆర్ఏల అరెస్టును ఖండిస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాదుకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వీఆర్ఏలకు వర్తింప చేయాలన్నారు. మా సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం వహిస్తే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి హక్కుల కోసం పోరాడి, సాధించి తీరుతామన్నారు. జిల్లా అధ్య క్షులు షేక్ బందగీ సాహెబ్, సత్తెనపల్లి డివిజన్ కార్యదర్శిలు పాల్గొన్నారు.

నూతనంగా 180 పెన్షన్లు మంజూరు

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు



పిడుగురాళ్ల: పట్టణంలోని 17 సచివాలయాలు, 33 వార్డులకు సంబంధించి నూతనంగా 180 పెన్షన్లు మంజూరు అయ్యాయని మున్సిపల్ కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటి వరకు పట్టణంలో 6200 పింఛన్లు ఉండగా నూతనంగా మంజూరైన 180 పింఛన్లతో మొత్తం 6380 పింఛన్లు అయ్యాయని ఆయన తెలిపారు. అయితే కొత్తగా మంజూరు అయిన పెన్షన్లు ముందుగా ఎవరైతే ఆన్‌లైన్‌లో అప్లికేషన్ పెట్టుకున్నారో వారికి మాత్రమే ప్రాధాన్యత ప్రకారం కేటాయించడం జరిగిందని ఆయన తెలియజేశారు.

క్రీడా పురస్కారం అందుకున్న ఏఎంజీ విద్యాసంస్థలు

చిలకలూరిపేటటౌన్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని 2022-23 విద్యాసంవత్సరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో ఏఎంజీ పాఠశాల రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం, జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించినట్లు ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి చెప్పారు. బుధవారం స్కూల్ ఆవరణలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రీడా ప్రతిభా అవార్డులను వివిధ క్రీడాపోటీల్లో ప్రతిభ కనపరిచిన పాఠశాలలకు అందజేయడం జరుగుతుందన్నారు పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంజీ సీఏవో మాశిలామణి, వ్యాయమ ఉపాధ్యాయులు కె రాజు, రాజేష్ పాల్గొన్నారు.

రీసర్వే ప్రక్రియను సమర్థంగా చేపట్టాలి

ముప్పాళ్ల: మండలంలో జరిగే మొదటివిడత జగనన్న భూరక్ష పథకంలో భాగంగా చేపట్టే రీసర్వే ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టి పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే పై వీఆర్వోలు, సర్వేయర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి రెండు గ్రామాల్లో సర్వే ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఏమైనా భూములకు సంబంధించి సమస్యలుంటే త్వరితగతిన అర్జీలు స్వీకరించాలన్నారు. సర్వేనెంబర్ లేకుండా ఉన్న భూములకు సంబంధించి వివరాలు సేకరించి జిల్లా జాయింట్‌కలెక్టర్ కు నివేదికలు పంపించాలన్నారు. స్థానిక రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని, వారి సమస్యలను తెలుసుకుని వారికి ఇబ్బందులు కలగకుండా సర్వేప్రక్రియలో రెవెన్యూ, సర్వే సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్, మండల సర్వేయర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

నరసరావుపేట టౌన్: ట్రాఫిక్ నియంత్రణకు వ్యాపారులు సహకరించాలని డీఎస్పీ కె.వి.వి. మహేష్ అన్నారు. బుధవారం అరండల్‌పేటలోని పలు ప్రధాన రహదారులను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా బ్యాంకుల వద్ద సెల్లార్ పార్కింగ్ లేకపోవటంతో ద్విచక్ర వాహనాలను నడిరోడ్లపై నిలుపుతున్నారన్నారు. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గుతుందన్నారు. ఇకపై రోడ్డుకు ఒకవైపు ద్విచక్ర వాహనాలు నిలుపుకునే విధంగా మార్కింగ్ ఇస్తామన్నారు. నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే వాహనాలు నిలుపుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే మొదట జరిమాన, రెండవసారి వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. పల్నాడు జిల్లా కేంద్రంగా నరసరావుపేట అవతరించినప్పటి నుంచి అనేక జిల్లా కార్యాలయాలు పట్టణంలో ఏర్పాటు అయ్యాయన్నారు. సేవల కోసం పలు ప్రాంతాల నుంచి వచ్చే ప్రజానీకంతో పట్టణంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిందన్నారు. వాహనదారులు, భవన యజమానులు ట్రాఫిక్ నియంత్రణలో తమవంతు సహకారం అందించాలని కోరారు. డీఎస్పీ వెంట వన్‌టౌన్, టూటౌన్ సీఐలు అశోక్ కుమార్, వీరేంద్రబాబు, ట్రాఫిక్ సీఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన



పండ్ల మొక్కల సస్యరక్షణ చర్యలను రైతులకు వివరిస్తున్న ఉద్యానశాఖ అధికారి మోహన్

రెంటచింతల: పండ్ల తోటలను సాగుచేసే రైతులకు పండ్ల మొక్కల పెంపకంపై అవగాహన ఎంతో అవసరమని గురజాల ఉద్యానశాఖ అధికారి వై.మోహన్ అన్నారు. బుధవారం రెంటచింతలకు చెందిన యన్నం మరియ సుధాకర్‌రెడ్డి సాగు చేస్తున్న ఎర్రజామ, సపోటా, సీతాఫలం, డ్రాగన్స్, అంజీరా, నేరేడు, కొబ్బరి, వాటర్ ఆపిల్, స్వీట్ ఆరంజ్, స్టార్ ఫ్రూట్స్, నల్ల జామ పండ్ల మొక్కలను ఆయన పరిశీలించారు. పండ్ల మొక్కలకు వచ్చే వివిధ రకాల తెగుళ్ల వాటి నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. అధికారుల సూచనలతో పండ్ల మొక్కలను పెంచిన అధిక దిగుబడులను సాధించి మంచి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధిహామీ పథకం కింద పండ్ల తోటల పెంపకంకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఉపాధి నిధులతో 100 శాతం రాయితితో పండ్ల పెంపకమునకు ప్రోత్సాహకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఎస్ఎఫ్, ఎంఎఫ్ రైతులతో పాటు 5 ఎకరాలు ఉన్న రైతులు నీటి వసతి ఉన్నవారు, బావి బోరు కలిగిన వారు ఈ పథకంకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మామిడి, జామ, నిమ్మ, సపోట, బత్తాయి, జీడి మామిడి, దానిమ్మ, యాపిల్ వేర్ పండ్ల మొక్కలను అందచేస్తామ న్నారు. దరఖాస్తు చేసుకోనే రైతులు పట్టాదారు పాస్ పుస్తకం నకలు, అడంగల్, వన్ బి, సన్న, చిన్న కారురైతు సర్టిఫికెట్, ఆధార్ కార్డ్ నకలు, రేషన్‌కార్డ్ నకలు, ఉపాధి జాబ్ కార్డ్ నకలుతో పాటు పాస్‌పోర్ట్ ఫోటో గురజాల తమ కార్యాలయంలో అందచేయాలని ఆయన కోరారు. ఆయన వెంట వీఏఏ పవన్ కిశోర్, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా మలేరియా అధికారి



ఏడో మైలు చెంచుకాలనిలోని ఇళ్ళలో దోమతెరలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

విజయపురిసౌత్: మాచర్ల మండలం ఏడో మైలు గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా మలేరియా అధికారి రవిరత్నాకర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి మలేరియా, డెంగీ వ్యాధుల గురించి అవి రాకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా దోమలు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా పరిసరాల్లో దోమలు లార్వా నిల్వ లేకుండా చేయడం, దోమల వ్యాప్తిని అరికట్టడం గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఏడో మైలు లోని చెంచుకాలనిలో ఇళ్ళలో వాడుతున్న దోమతెరలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చార్లెస్‌వెస్లీ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మయ్య, సూపర్‌వైజర్ నాగేశ్వరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్, ఈ-కేవైసీ చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పుల్లారావు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో 2023-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి చేపట్టిన ఈ- క్రాప్ బుకింగ్, ఈ-కేవైసీ వేగవంతం చేయాలని తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో చేస్తున్న ఈ-క్రాప్ బుకింగ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేయడం జరిగిందన్నారు. మండలంలో ఈ ఏడాది 24,12 ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగుచేస్తున్నారని ఇప్పటి వరకు సుమారు 1,802 ఎకరాల్లో సాగుచేస్తున్న పంటల వివరాలను ఈ- క్రాప్ బుకింగ్ 74.71 శాతం ఈ-కేవైసీ పూర్తి చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బందితో పాటు గ్రామ వీఆర్వోలు సంయుక్తంగా ఈ- క్రాప్‌బుకింగ్, ఈ-కేవైసీ చేయడం జరుగుతుందన్నారు. ఈ- క్రాప్ బుకింగ్, ఈ-కేవైసీ చేయించుకోవడం వలన రైతులకు, కౌలు రైతులకు కూడ పండించిన పంటలు అమ్ముకోవచ్చు, బ్యాంక్ రుణాలు, పంట నష్టపరిహారం, రైతుభరోసా వంటి ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి, ఆర్ఐ దాసరి కాంతారావు, వీఆర్వోలు పల్లా రామకృష్ణ, షూక్రూ, బాలయ్య, పాశం నాసర్‌రెడ్డి, తదితరులున్నారు.

పీఆర్కేకు రాఖీ కట్టిన మహిళా ప్రజా ప్రతినిధులు



రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కేకు రాఖీ కడుతున్న మహిళా ప్రజా ప్రతినిధులు

మాచర్ల: పట్టణంలోని రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని పలు చోట్ల రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా మానుకొండ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మహిళా ప్రజా ప్రతినిధులు రాఖీ కట్టారు. రెంటచింతల ఎంపీపీ చౌడేశ్వరి, లెదర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బూదాల మరియమ్మ, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు నాగమణి, మహిళా కౌన్సిలర్లు గట్లా అరుణ, యర్రాకుల సిద్దమ్మ, వేల్పుల విజయకుమారిలు పీఆర్కేకు బొట్టు పెట్టి, హారతిచ్చి రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు, మెప్మా ప్రాజెక్టు స్థానిక అధికారి ఎంవి సుబ్బారావు, ఆర్ఐ వెంగయ్య, రంజిత్‌తో పాటు పలువురు ఉద్యోగులకు బ్రహ్మకుమారీస్ సంస్థ మహిళా సభ్యులు రాఖీలు కట్టి మిఠాయి ప్యాకెట్లు అందజేసి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో భారీ స్థాయిలో బుధవారం రాఖీ పండుగ సంబరాలు జరుపుకున్నారు.

ఫ్యామిలీ వైద్యాధికారి సేవలు పొందాలి

శావల్యాపురం: ఫ్యామిలీ వైద్యాధికారి పేదలందరు సద్వినియోగం చేసుకోవా లని జిల్లా వైద్యాధికారిణి జి.శోభారాణి అన్నారు. బుధవారం మండలంలో ని కొత్తలూరు గ్రామపంచా యతీ శివారు గ్రామమైన తుమ్మలకుంట గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ వైద్యాధికారి కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో ఆకస్మికంగా సందర్శించారు. ఈ నందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగుల ఇళ్లను నేరుగా వైద్యాధికారి సందర్శించి వైద్యసేవలతో పాటు రోగికి ఆరోగ్య భరోసా కల్పించి ఉచితంగా మందులు ఇస్తామన్నారు. అలాగే అంగన్‌వాడీ సెంటర్లు నందర్శించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రక్తహీనతకు గురికాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్, ఎంఎల్‌హెచ్‌పీ పృద్విరాణి, ఆరోగ్య కార్యకర్త ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వారంలో ఆన్‌లైన్ పెండింగ్ ఓట్లను నమోదు చేయాలి

యడ్లపాడు: ఆన్‌లైన్ చేయాల్సిన ఓటర్ల పెండింగ్‌ను వారంలోగా పూర్తి చేయాలని సహాయ ఎన్నికల అధికారి, ఇన్ చార్జ్ తహసీల్దార్ జి సుజా త చెప్పారు. యడ్లపాడు లోని సచివాలయం-1లో బీఎల్‌వోలతో మంగళవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బీఎల్‌వోలతో మాట్లాడుతూ ఓటర్ల జాబిత ఇంటింటి పరిశీలన ప్రక్రియ యడ్లపాడు మండలం పరిధిలో వందశాతం పూర్తి చేశామన్నారు. మండలంలో 57 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 44,192 మంది ఓటర్లు ఉన్నాయన్నారు. అందులో పురుషులు 21,450 మంది ఉండగా, 22,742 మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇంటింటి సర్వే ప్రక్రియలో భాగంగా గుర్తించి 4,197 వివిధ రకాల క్లయిమ్‌లను వేగవంతంగా పునః పరిశీలన చేయాలని సూచించారు. అలాగే ఇంకా ఆన్‌లైన్ పెండింగ్ ఉన్న 1977 ఓటర్ల నమోదును వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల తుది జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా చేపట్టి స్వచ్ఛ ఓటర్ల జాబితాను రూపొందించేందుకు బీఎల్‌వోలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్యామలత, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.